క్లుప్తంగా

రైల్వే స్కూల్ విద్యార్థినులకు రక్త పరీక్షలు



రైల్వే స్కూల్‌లో విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న ఆశ వర్కర్, ఏఎన్ఎం

అల్లిపురం : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తోంది. వారికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం ఆశ వర్కర్ అనూష, ఏఎన్ఎం సుందరకాంతం రైల్వేస్టేషన్ దరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. వారిలో హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు. రక్తం తక్కువగా ఉన్న వారిని గుర్తించి వారికి తగిన మందులు అందజేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విద్యార్థినులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి తెలియజేశారు.

మెరుగైన యువతి ఆరోగ్యం



యువతిని వసతిగృహానికి తీసుకువచ్చిన మమత

అల్లిపురం : ఈ నెల 18వ తేదీన రైల్వేస్టేషన్ 2వ నంబర్ ప్లాట్‌ఫాంపై కదలలేని స్థితిలో ఉన్న యువతిని మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమత ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ ఆమెకు చికిత్స అందజేయటంతో ఆమె కోలుకుంది. తనపేరు లక్ష్మీ మహానంద్ అని, తన తండ్రి పేరు ఆత్రవ మహానంద్ అని, తమది సమ్మల్‌పూర్ అని తెలియజేసింది. ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో ఆమెను వైద్యులు మంగళవారం డిశ్చార్జి చేశారు. దీంతో ఆమెకు మమత ఎస్‌పీడీ జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఆమె తల్లిదండ్రులకు తెలియజేసి వారికి అప్పగించనున్నట్లు మమత తెలిపారు.

సీబీఐ విచారణ జరిపించాలి

సీతమ్మధార : విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధాని చేస్తున్నామనే పేరుతో వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు వైఎస్సార్‌సీపీ నేతలు దోచుకుంటున్నారని జనసేన నాయకులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మద్యం, ఇసుక, ప్రభుత్వ ఆస్తుల దోపిడీయే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పీఏసీ సభ్యులు కోన తాతారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కేడీపీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమతి బాయి అన్నారు. మంగళవారం ఉదయం పాఠశాల పూర్వ విద్యార్థుల సహాయంతో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడారు. చదవుకున్న పాఠశాలను మరువకుండా ప్రతి సంవత్సరం కార్యక్రమాలను నిర్వహిస్తున్న 2002 బ్యాచ్ విద్యార్థులను అభినందించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డి.లక్ష్మీపతి, పాఠశాల పీఈటీ ఎన్.రత్నం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు గొడుగు.. గిడుగు

ప్రభుత్వ కార్యకలాపాలు, ఇతరత్రా వ్యవహారాలన్నీ గ్రాంథిక భాష నుంచి వ్యావహారిక భాషలోనే సాగాలని, పామరులు వాడే తెలుగు భాషనే అన్నిచోట్లా వాడాలని ఉద్యమం చేసిన గొప్ప భాషావేత్త గిడుగు రామ్మూర్తి పంతులు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవకు గుర్తుగా ఆయన జయంతినే తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆయన సేవలకు ఘనంగా నివాళులు అర్పించుకుంటున్నాం.

- పలు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో వ్యావహారిక భాషోద్యమకర్త రామ్మూర్తి పంతులు జయంతి



ఏవీఎన్ కళాశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవానికి హాజరైన ప్రముఖులు



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న వక్త

దాబాగార్డెన్స్ : గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 160వ జయంతి, తెలుగు భాషా దినోత్సవం మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, జోన్–1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి పాల్గొని గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు విభాగాధిపతి ఎన్‌వీ పద్మకుమారి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, క్విజ్, ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐబీఏసీ కోఆర్డినేటర్ డి.అరుణపద్మ, హిందీ అధ్యాపకులు డాక్టర్ కె. సుధ, ఉపాధ్యాయులు బి.శాంతి, డాక్టర్ పీఎల్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు

అల్లిపురం : తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని అల్లిపురం శాఖా గ్రంథాలయ అధికారి పి.రాజు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాంథిక బాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక బాషలోకి తీసుకు వచ్చిన ఘనత గిడుగుకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో..

తెలుగు భాషాభివృద్ధిలో గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతి ఉత్సవాలు మంగళవారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీ రంగ నిష్ణాతులు, తెలుగు భాషాభిమానులు పాల్గొని తెలుగు భాషా పరిరక్షణపై ప్రసంగించారు. పాఠశాల విద్యలో తెలుగు పాఠ్యాంశాల నుంచి పద్య విభాగాన్ని తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాష పుట్టింది ప్రజల కోసం తప్ప పండితుల కోసం కాదని వక్తలు స్పష్టం చేశారు. తెలుగు భాష పరిరక్షణలో గిడుగు చేసిన కృషిని వక్తలు శ్లాఘించారు. భాషా వేత్తలు మీగడ రామలింగస్వామి, జాలాది విజయ, మేడా మస్తాన్‌రెడ్డి, కేజీ వేణు, రాజేశ్వరరావు, రామారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అతిథులు

తెలుగు భాషాభివృద్ధికి అందరూ కృషి చేయాలి

తెలుగు భాషాభివృద్ధికి అందరూ కృషి చేయాలని మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు కోరారు. తెలుగు భాషా దినోత్సవం, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 160వ జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు కళాశాల అకడమిక్ డీన్ జి.శంకర్ నారాయణరావు, ఇంటర్మీడియట్ ఇన్‌చార్జి కె. అప్పారావు, కళాశాల తెలుగు విభాగాధిపతి పి.వెంకటరత్నం పాల్గొని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి తెలుగు భాష ఎంతో తోడ్పడుతుందన్నారు. దేశంలో ఎన్ని భాషలున్నా తెలుగు భాష ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఆగస్టు 29వ తేదీన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నామని వివరించారు. తెలుగు భాష అభ్యున్నతికి గిడుగు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతి పైడి రజని, అధ్యాపకురాలు వినీత, తెలుగు అధ్యాపకులు డబ్బీరు గాయత్రి, బి.నరసింహమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికతో కృషి చేస్తే విజయం తథ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కొమ్మాది: మనలోని బలం, బలహీనతలను తెలుసుకుని ఒక ప్రణాళిక ప్రకారం కృషి చేస్తేనే విజయం సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం విద్యాలయ నిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటేనే విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరుకోగలరన్నారు. విద్యాలయానికి రెండు బోరు బావులు, 4 తరగతి గదులు, పది కంప్యూటర్లు, పార్ట్‌టైమ్ డాక్టర్ సదుపాయం కల్పించడంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్, రోడ్ల మరమత్తులు చేయడానికి వీలుగా సీపీడబ్ల్యూడీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. తాను కడప జిల్లాలో నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, వైద్య వృత్తి అనంతరం సివిల్స్‌కు ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ కె.సంజయ్, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



మధురానగర్ జీవీఎంసీహైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

సీతంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సీతంపేట మధురానగర్‌లో ఉన్న జీవీఎంసీ హైస్కూల్‌లో 'నేత్రదానం, ఆవశ్యకత'పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నేత్ర వైద్యశాఖ సిబ్బంది, ఐ డొనేషన్ కౌన్సిలర్లు స్కూల్‌లో చదువుతున్న 9,10 తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేత్రదానం ఆవశ్యకతను వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం డి.శాంతికుమారి, ఐడొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, టెక్నీషియన్ హాస్పెస్ పాల్గొన్నారు.

ఎన్జీజీవోస్ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు



అవార్డు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

సీతంపేట: జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చేతుల మీదుగా ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస, పీడీ సునంద్ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభ అవార్డు అందుకున్నారు. గోపాలపట్నంలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో క్రీడల్లో ప్రతిభ చూపిన పాఠశాలలకు అవార్డులు అందజేశారు. 46 పాయింట్లతో ఆటల్లో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీహైస్కూల్ అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్ పతకాలు సాధించిన క్రీడాకారులను, పాఠశాల హెచ్‌ఎం, పీడీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ జూన్ గెలెట్ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా చాటుతున్న సాయిసాహితి



సాయిసాహితి

విశాఖ స్పోర్ట్స్ : నగరానికి చెందిన సాయిసాహితి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటుతోంది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన పసిఫిక్ కప్ ఇన్‌లైన్ ఫ్రీస్కేటింగ్ బాలికల విభాగంలో సాయిసాహితి ద్వితీయస్థానంలో నిలువగా...ఫ్రీ స్కేటింగ్ బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచింది. ఫిగర్ స్కేటింగ్ ఓవరాల్‌లో సాయిసాహితి తృతీయస్థానంలో నిలిచింది. ఇప్పటివరకు పన్నెండేళ్ల ప్రాయంలోనే పలు జాతీయస్థాయి పోటీలతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ తలపడి ఆర్టిస్టిక్ విభాగంలో పలు పతకాలను సొంతం చేసుకుంది. వరల్డ్‌స్కేట్ ఓషియేనియా ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆస్ట్రేలియా,న్యూజిలాండ్, బ్రెజిల్, భారత్, జపాన్, చైనీస్ తైపెయ్, యూఎస్ఏ స్కేటర్ల జట్లు పాల్గొన్నాయి.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఎంవీపీ కాలనీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మిడిల్ క్లాస్ బైకర్ సహకారంతో మాంక్‌ఫిట్ ఆర్గనైజేషన్ మంగళవారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏయూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ శిబిరాన్ని ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, క్రీడా విభాగాధిపతి డాక్టర్ పల్లవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేసినట్లు మాంక్‌ఫిట్ సంస్థ ప్రతినిధులు మహేష్, శ్రీనివాసరావు వెల్లడించారు. ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు.

మన దేవాలయం-మన హక్కు సంతకాల సేకరణ

ఏయూ క్యాంపస్: టీటీడీ పాలక మండలి ఏర్పాటులో భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం పెదవాల్తేరు పోలమాంబ ఆలయ ప్రాంగణంలో మన దేవాలయం-మన హక్కు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలక మండలి నియామకంలో ఆధ్యాత్మిక గురువుల సూచనలు తీసుకోవాల్సిందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారసత్వ సంపద భావితరాలకు అందాలి

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ నరసింహారావు తదితరులు

ఏయూ క్యాంపస్: తెలుగు భాషను వారసత్వ సంపదగా భావితరాలకు అందించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతృభాషలో అనర్గళంగా మాట్లాడలేని వారు పరభాషలలో కూడా మాట్లాడలేరని, మనం చదువుకు ఇచ్చే ప్రాధాన్యత కంటే భాషకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి తరం విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకున్నప్పటికీ భాష విషయంలో వెనుకంజలో ఉంటున్నారన్నారు. తెలుగు భాషలో అమూల్యమైన గ్రంథాలు ఉన్నాయని, అందులో మన జీవితానికి పనికి వచ్చే అంశాలను గ్రహించి ఇతర భాషల్లోకి తర్జుమా చేసి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలని సూచించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు పాటు పడినట్టు ప్రతి ఒక్కరు కంకణ దారులై భాష మనుగడకు నడుం కట్టాలన్నారు. తెలుగులో అవధాన ప్రక్రియ మనకే సొంతమని, అటువంటి సాహిత్య ప్రక్రియకు ఆధునితను మేళవించి భాషను రక్తి కట్టించాలన్నారు.

ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గిడుగు వంటి మహనీయుల త్యాగం ఫలితంగా ఏయూలో మొదట తెలుగు విభాగం ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించగా, ఆతీయ అతిథులుగా ఆచార్య జి.యోహానుబాబు, డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, మీగడ రామలింగస్వామి, పరవస్తు పణిశయన సూరి హాజరయ్యారు. అనంతరం తెలుగు పరిశోధక విద్యార్థి ఇళ్ల మురళీధరరావు రచించిన పద్యకావ్యాలను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు(యోగి), పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



లక్ష్మీ టాకీస్ ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సీట్లు, కళాశాలల్లో అడ్మిషన్లు, జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో ఉద్యోగాలు తదితర సమస్యలతో వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా పనుల పరిష్కారానికి కృషి చేశారు. అదే విధంగా కరోనా సమయంలో వేట సాగక నష్టపోయిన తమకు బెర్త్ చార్జీల బకాయిల్లో 75 శాతం రాయితీ ఇప్పించాలని బోట్ యజమానులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఉచిత ఇళ్ల స్థలాలు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు కావాలని పలువురు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి తెలిపి, అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 38వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సన్యాసిరావు, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ సందడి



ఆకట్టుకుంటున్న రాఖీలు



చిన్నారులకు నచ్చే ఆకృతుల్లో..

జగదాంబ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. కులమతాలతో సంబంధం లేకుండా ప్రతి ఇంటా అందరు కలిసి చేసుకునే వేడుక ఇది. ఈ ఏడాది రక్షాబంధన్‌కు పూర్ణామార్కెట్‌లో అనేక చోట్ల స్టాల్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున అమ్మకాలు చేస్తున్నారు. రకరకాల ఆకృతుల్లో ఇక్కడ విక్రయిస్తున్న రాఖీలు కొనుగోలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. అలాగే చిన్నారులను ఆకట్టుకునే వివిధ రకాల రాఖీలు ఇక్కడ విక్రయిస్తున్నారు. పూర్ణామార్కెట్‌లోని షాపులు, ఫుట్‌పాత్‌లపై చిన్నచిన్న దుకాణాలు అనేకం వెలిసాయి. అలాగే రాఖీ సందర్భంగా మిఠాయి దుకాణాలు కూడా ఎక్కువగా ఏర్పాటు చేశారు.

చురుగ్గా జేసీఎస్ ఇన్సూరెన్స్ నమోదు



జేసీజే ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్‌తో రంథి గోపీకృష్ణ, గృహసారథులు, కన్వీనర్లు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డులో జేసీఎస్ ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. వేంకటేశ్వరమెట్ట సచివాలయం ఆవరణలో మంగళవారం వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేసీజే ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ సమక్షంలో గృహసారథులు, కన్వీనర్లు పాల్గొని ఇన్సూరెన్స్ నమోదు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కన్వీనర్లు, గృహ సారథులు కష్టపడి పనిచేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రి పదవిని కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యకర్తల బాగోగులు చూసే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించే విధంగా జేసీఎస్ ఇన్సూరెన్స్ కార్యక్రమం చేపట్టారన్నారు. అనంతరం వార్డు అధ్యక్షుడు, కన్వీనర్లు, గృహసారథులు కోడిగుడ్ల శ్రీధర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు ఎం.రమేష్, ఆడారి వెంకట మహేష్, అయ్యప్పరెడ్డి, వేగి వెంకటప్పారావు, ఊర్వశి, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7న జీవీఎంసీ దుకాణాలకు వేలం

జగదాంబ : జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో వచ్చే నెల 7వ తేదీన దుకాణాలు, కల్యాణ మండపాలు, క్యాంటీన్లకు సంబంధించి వేలం పాట నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35వ వార్డు స్ప్రింగ్‌రోడ్డు వద్ద డయాస్ ట్యాంక్ కింది అంతస్తులోని దుకాణాల్లో 9,10,11,12,13 జనరల్, 15 ఎస్సీ కేటగిరీకి, ఇదే సముదాయంలో మొదటి అంతస్తులోని 1, 2 దుకాణాలు ఎస్సీ కేటగిరీకి, 3 నుంచి 7 వరకు, 9 నుంచి 15 వరకు జనరల్ కేటగిరీకి వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇదే వార్డులో ఓల్డ్ బస్టాండ్ వద్ద పేజ్–2లో ఉన్న 1 నుంచి 6,8,10,11,13,14,15 జనరల్, 7, 12 ఎస్సీ, 9 ఎస్టీ కేటగిరీలో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 31వ వార్డు జగదాంబ వాణిజ్య సముదాయంలో 3,5,13,14 ఎస్టీ కేటగిరీకి, 39వ వార్డు లక్ష్మీ టాకీస్ దుకాణ సముదాయంలో 1,3,6,7,11,12 జనరల్, 8 ఎస్సీ కేటగిరీ, అదే విధంగా జోన్–4 కార్యాలయం సూర్యాబాగ్ వాణిజ్య సముదాయంలో దుకాణం నెంబర్ 8 జనరల్‌కు, 37వ వార్డు అంబేడ్కర్ కల్యాణ మండపం, రెల్లివీధి ఫిష్ మార్కెట్‌కు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు జోనల్ కార్యాలయంలో పూర్తి సమాచారం తెలుసుకోవాలని జోనల్ కమిషనర్ తెలిపారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ ప్రతినిధులు

సీతమ్మధార : రోటరీ క్లబ్ విశాఖవ్యాలీ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సీతమ్మధారలోని జీవీఆర్ రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో 12 మంది మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆసరా చారిటబుల్ సొసైటీ, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా గుర్తించిన లబ్ధిదారులకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్, కె.రమాప్రభ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు రోటరీ అందించిన సహకారం ఎంతో ప్రయోజనం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వీసీసీ జిల్లా కన్వీనర్ కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

13వ రోజుకి శ్రావణ లక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవా రం 13వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. ఈ ప్రత్యేక పూజలో